క్లుప్తంగా

సకాలంలో నిర్మాణాలు పూర్తిచేయాలి



తంపటాపల్లిలో హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

పాలకొండ రూరల్: హౌసింగ్ లబ్ధిదారులు నిర్దేశిత సమయంలో వారికి కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ మాధవరావు అన్నారు. స్థానిక జగనన్న కాలనీల్లో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల తాజా స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లుల మంజూరుపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని తంపటాపల్లితో పాటు పలు పంచాయతీల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులను కలిసి నిర్మాణాలపై అవగాహన కల్పించారు.

పకడ్బందీగా ఎస్‌డీజీ సర్వే



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: సస్టయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌డీజీ) సర్వే పకడ్బందీగా చేయాలని ఎంపీడీఓ కె.సత్యం అన్నారు. గొయిది గ్రామ సచివాలయాన్ని శనివారం సందర్శించారు. ఎస్‌డీజీ సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. 0–5 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, 6–19 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఎంతమంది ఉన్నారనేది సర్వే చేయాలన్నారు. అలాగే గర్భిణుల వివరాలు సేకరించాలని సూచించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



చినమేరంగి వద్ద విద్యుత్ పనులు చేస్తున్న సిబ్బంది

జియ్యమ్మవలస: ఈదురుగాలులకు మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో గురు, శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది శనివారం మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. ఏఈ బడే శ్రీనివాసరావు పనులను పర్యవేక్షించారు.

శునకాన్ని రక్షించిన ఫైర్ సిబ్బంది



సెప్టిక్ ట్యాంకులో నుంచి కుక్కను బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరిలోని ఓ ఇంటి ఆవరణలో ఉన్న సెప్టిక్ ట్యాంకులో శనివారం ప్రమాదవశాత్తు పడిన వీధి కుక్కను గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలతో రక్షించారు. సుమారు 6 అడుగుల లోతు ఉన్న సెప్టిక్ ట్యాంకులో వర్షపునీరు, చెత్త చేరి ఉంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడిపోయిన వీధికుక్క బయటకొచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దీన్ని గమనించిన అగ్నిమాపక సిబ్బంది సెప్టిక్‌ట్యాంకులో దిగి కుక్కను బయటకు తీసి విడిచిపెట్టారు. వీధికుక్క అయినప్పటికీ సురక్షితంగా రక్షించిన అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందిస్తున్నారు.

ట్రిపుల్ ఆర్ వర్కుషాపు ఏర్పాటు



వర్కుషాపు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ రాధాకుమారి, కమిషనర్ సర్వేశ్వరరావు తదితరులు

పాలకొండ: నగర పంచాయతీలో పరిసరాల పరిశుభ్రత, కాలుష్య నియంత్రణే ధ్యేయంగా ట్రిపుల్ ఆర్ వర్కుషాపు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు చెప్పారు. రెడ్యూస్–రీ సైకిల్–రీయూజ్ నినాదంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ వర్కుషాపును చైర్మన్ యందవ రాధాకుమారి శనివారం ప్రారంభించారు. చెత్త సేకరణ, రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ గడపలో సంక్షేమ సంతోషం

వీరఘట్టం:

ప్రభుత్వం తలపెట్టిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజా క్షేత్రంలో మంచి ఆదరణ లభిస్తోంది. మండలంలోని నీలానగరంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా..ప్రజలు నీరాజనాలు పలికారు. ప్రతీ గడపలో వారికి హారతిచ్చి స్వాగతం పలికారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో తమ కుటుంబాలు బాగుపడ్డాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. మహిళలు, వృద్ధులు, యువతతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆప్యాయంగా మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. యువత విజ్ఞతతో ఆలోచన చేయాలని కోరారు. యువతను తప్పుదోవ పట్టించేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు ఇళ్ల స్థలాలు కావాలని, మురుగు కాల్వలు బాగు చేయించాలని, కొత్త రోడ్డు వేయించాలని, కరెంటు లైన్లు బాగుచేయించాలని విజ్ఞప్తి చేశారు. అందరి వివరాలను వెంటనే రెవెన్యూ, హౌసింగ్, పంచాయతీ, ట్రాన్స్‌కో అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జై జగన్ నినాదాలతో గ్రామం హోరెత్తింది. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, సర్పంచ్ వావిలపల్లి పురుషోత్తమరావునాయుడు, ఎంపీటీసీ బొత్స ప్రకాశరావు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు, మాచర్ల వెంకటరమణ, ఉదయాన జగన్, పాలవలస ధవలేశ్వరరావుతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ లబ్ధిపత్రాన్ని మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

నియామక పత్రాలు అందజేత

వీరఘట్టం: ప్రతి ఒక్కరికీ అవకాశాలు రావని, అవకాశం వచ్చినప్పుడు మాత్రం వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఇటీవల సీతంపేట ఐటీడీఏలో నిరుద్యోగ యువతకు నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన 223 మందికి 14 కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చాయి. ఈ ఉద్యోగ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఎంపికైన వారికి వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ సాయికుమార్, ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకులకు..

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస, పీవీఆర్ పురం, విక్రమపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకుల పోస్టులకు ఎంపికైన వారికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం నియామక పత్రాలు అందజేశారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. చిట్టపులివలసకు గొట్టాపు గౌతమి, పీవీఆర్ పురానికి తురక సంధ్య, విక్రమపురానికి ఎస్.పుష్ప ఎంపికైనట్లు సీడీపీఓ పూర్ణిమ తెలిపారు.

మత్తు పదార్థాల వియోగంతో అనర్థాలు

పాలకొండ రూరల్: నిషేధిత మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారి బి.భాస్కరరావు అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ విభాగం, జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాలతో శనివారం పాలకొండ వైద్య బృందాలు, పలు శాఖల అధికారులు కలిసి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ముఖ్యంగా విద్యా సంస్థలు, పాఠశాలలు, ఆస్పత్రుల సమీపంలో ఉన్న కిరాణా దుకాణాలను పరిశీలించారు. ఖైనీ, గుట్కాలు వంటి నిషేధిత పదార్థాలు అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. వాటిని విక్రయిస్తున్న దుకాణదారులకు వెయ్యి రూపాయల అపరాద రుసుం విధించారు. ఈ డ్రైవ్‌లో హెల్త్ సూపర్‌వైజర్లు బి.జగదీష్‌కుమార్, ఇందిర, ఎన్‌టీసీపీ సోషల్ వర్కర్ కె.భవాని, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు సిబ్బంది ఉన్నారు.



ఏరియా ఆస్పత్రి వద్ద దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

మహాసభలను విజయవంతం చేయండి

కురుపాం: గిరిజన సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా గౌరవ అధ్యక్షుడు మండంగి రమణ, కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, లక్ష్మణరావు, కె.సీతారాం, తిరుపతిరావు పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ వచ్చే నెల 16,17 తేదీల్లో గిరిజన సంఘం పార్వతీపురం మన్యం జిల్లా 7వ మహాసభలు కురుపాంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. గిరిజనుల హక్కులు, చట్టాలు, జీవో నంబరు-3, 1/70 యాక్ట్, గిరిజనుల సమస్యలపై, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు చెప్పారు. గిరిజ నులంతా ఈ సభల్లో పాల్గొని వియజవంతం చేయాలని కోరారు.



మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న గిరిజన సంఘ నాయకులు

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

గరుగుబిల్లి: మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సంఘ సభ్యులతో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఇంతవరకు గ్రూపుల్లో చేర్పించని మహిళలను, అర్ధాంతంతరంగా నిలిచిపోయిన సంఘాలను పునరుద్ధరించాలన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సంఘాలలో చేరేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీసీలు సిహెచ్.తిరుపతిరావు, బి.రామినాయుడు, సిహెచ్.ప్రసాద్, వి.లక్ష్మణరావు, కె.కృష్ణ తదితరులున్నారు.



ర్యాలీలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: వాహన చోదకులు వారు నడుపుతున్న వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సీఐ మురళీధర్ అన్నారు. పట్టణం పరిధిలో యాలం కూడలి, సీంపేట, శ్రీకాకుళం రహదారుల్లో శనివారం రాత్రి సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సదరు వాహనాల రికార్డులు, చోదకుల వివరాలు, డ్రైవింగ్ లైసెన్సులను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించినవారిపై అపరాద రుసుం విధించారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ మురళీధర్

గిరిజన గ్రామాల్లో ఇంటి వద్దకే వైద్య సేవలు

భామిని: మండలంలోని దిమ్మిడిజోల, లోవగూడ గిరిజన గూడల్లో శనివారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భామిని వైద్యాధికారి ఎస్.ఫణికుమార్ సుమారు 67 మందికి వైద్య సేవలందించారు. లోవగూడలో డయేరియాతో బాధపడుతున్న గిరిజనుడు బిడ్డిక రాజారావు ఇంటి వద్దకు వెళ్లి వైద్యం అందజేశారు. మెరుగైన చికిత్స కోసం ఫీడర్ అంబులెన్స్‌పై భామిని పీహెచ్‌సీకి తరలించారు. అలాగే ముగ్గురు జ్వరాలతో బాధపడుతుండడంతో వారి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తుండడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీహెచ్‌ఓ భాస్కరరావు, ఏఎన్‌ఎం సుజాత, హెచ్‌ఓ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలు, 104 సిబ్బంది సహకారం అందించారు.



లోవగూడలో ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఫణికుమార్

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: జగనన్న విదేశీ విద్యాదీవెన కింద ఆర్థిక సాయం పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమం, సాధికారత అధికారి గయాజుద్దీన్ ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. 35 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. జూన్ 10వ తేదీలోగా హెచ్‌టీటీపీ://జ్ఞానభూమి.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులంతా క్వాలిఫై అయిన పరీక్షల్లో 60 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎంబీబీఎస్‌కు దరఖాస్తు చేసుకునే వారు నీట్ తప్పనిసరిగా క్వాలిఫై అవ్వాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

గుమ్మలక్ష్మీపురం: సైబర్ నేరగాళ్లు పెన్షనర్ల లైఫ్ సరిఫికెట్ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తామని చెప్పి కొత్తరకం మోసాలకు పాల్పడుతున్నారని, ఈ విషయంపై పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలని పెన్షనర్ల సంఘం మండల నాయకులు బగ్గం బాబ్జిప్రసాద్, గుడ్ల హరిప్రసాద్, జగన్నాథ రథో శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల వద్ద అపాయింట్‌మెంట్ తేదీ, పదవీ విరమణ తేదీ, పీపీఓ నంబర్, ఆధార్ కార్డ్ నంబర్, శాశ్వత చిరునామా, ఇమెయిల్ ఐడీ వంటి ప్రాథమిక వివరాలు ఉంటాయని, ఈ మొత్తం డేటాతో కాల్ చేసి మాయమాటలు చెప్పి నమ్మిస్తారని, ఓటీపీ సేర్ చేయమని అడుగుతారని, ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీ మాత్రం వారికి తెలియచేయొద్దని సూచించారు. లైఫ్ సర్టిఫికెట్ కోసం పెన్షన్ డైరెక్టరేట్ నుంచి ఓటీపీ చెప్పమని ఎప్పుడూ కాల్ చేయరని, ఈ విషయాన్ని పెన్షనర్లు గ్రహించాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150, బీసీ, ఓసీలకు రూ.200 ప్రవేశ రుసుం చెల్లించి ఈ నెల 22 నుంచి జూన్ 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9542078996 నంబరులో సంప్రదిచాలని కోరారు.

గ్రామ వలంటీర్లకు సత్కారం



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు

సీతంపేట: మండలంలోని దారపాడులో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లకు ఎంపీపీ బి.ఆదినారాయణ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వలంటీర్లు అనుసంధాన కర్తలని, ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వారిదే కీలకపాత్ర అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండపల్లి సత్యం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య భద్రతకు చర్యలు

పాలకొండ: రాష్ట్రంలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా కార్మికులకు ఆరోగ్య సమస్యలు రాకుండా ప్రతీ పరిశ్రమలో, కర్మాగారంలో, నిర్మాణ రంగ సంస్థల యజమానులు తగు జాగ్రత్తలతో కూడిన చర్యలు చేపట్టాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కిరణ్‌చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పని వేళలను ఉదయం, సాయంత్రంకు మార్పులు చేసుకునేలా వెసులుబాటు కల్పించాలన్నారు. కార్మికులకు పీస్ రేటు ధరలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందజేయాలని సూచించారు. పని ప్రదేశాల్లో మంచినీరుతో పాటు, ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



ఐటీడీఏ అంబులెన్స్ ప్రసవించిన మహిళ

సీతంపేట: అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవించి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తురాయిమానుగూడకు చెందిన సవర మధులతకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఐటీడీఏ కంట్రోల్ రూమ్‌కు అంబులెన్స్ కోసం ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన సిబ్బంది గ్రామానికి అంబులెన్స్‌ను పంపించారు. ఆమెను ఆస్పత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో కుడ్డపల్లి వద్ద ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆశా కార్యకర్త మీనాకుమారి, పైలెట్ వంశీ తల్లీబిడ్డలకు సపర్యలు చేసి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులతో చదివిస్తున్న ఉపాధ్యాయుడు రమేష్

భామిని: స్థానిక శాఖాగ్రంథాయలంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం విద్యార్థులకు దేశ నాయకుల జీవిత చరిత్రను సోషల్ టీచర్ రమేష్ వివరించారు. విద్యార్థులతో సమాజిక చైతన్య గీతాలు, జానపద గీతాలను పాడించారు. గ్రంథాలయ అధికారి ఎ.సునీత, ఉపాధ్యాయుడు నారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పానికి సహకరించండి

- డీఎల్‌పీఓ జె.రామ్‌ప్రసాదరావు

భామిని: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందామని డీఎల్‌పీఓ జె.రామ్‌ప్రసాదరావు పిలుపునిచ్చారు. మండలంలోని కోసలి, కీసర పంచాయతీల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా శనివారం పారిశుద్ధ్య పనులు చేటప్టారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కీసర పంచాయతీ కార్యాలయానికి ఆనకుని ఉన్న చెత్తకుప్పలు తొలగింపునకు కొందరు గ్రామస్తులు అడ్డుపడడంతో వారితో మాట్లాడి ఒప్పించారు. బత్తిలి ఏఎస్సైలు తులసినాయుడు, గురుమూర్తి ఆధ్వర్యంలో కార్యదర్శి ఎం.మహేంద్రకుమార్ జేసీబీ సాయంతో చెత్తకుప్పలు తొలగించి, మురుగునీరు పోయేందుకు వీలుగా కాలువలు తవ్వించారు. అనంతరం కోసలిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణను డీఎల్‌పీఓ పరిశీలించి అక్కడి సిబ్బందిని అభినందించారు.



కీసర గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రామ్‌ప్రసాదరావు

తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు

కొమరాడ: ఉపాధిహామీ పనులకు వస్తున్న వేతనదారులకు మాత్రమే మస్తర్లు వేయాలని, పనికి హాజరు కానివారికి మస్తరు నమోదు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. మండలంలోని శివిని గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రసహాయకులు పని ప్రదేశంలో ఉండాలని, పారదర్శకంగా కొలతలు వేయాలని సూచించారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత ఫీల్డ్‌అసిస్టెంట్, మేట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, టెంట్లు అందుబాటులో ఉంచాలనీ ఏపీఓ బాలకృష్ణ సిబ్బందికి సూచించారు.



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు

యోగాతో ఒత్తిడి దూరం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగాసనాలు వేయడం వల్ల ఒత్తిడిని జయించ వచ్చని యోగా ట్రైనర్ జె.జనార్దనరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో కొన సాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించి, వాటి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ మురళి, గ్రంథాలయ ఇన్‌చార్జి బి.గణేష్‌బాబు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా మంజూరు

పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలస గ్రామానికి చెందిన అక్కుపల్లి సత్యనారాయణ ఇటీవల వెలగవాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.5 లక్షలు పరిహారం మంజూరు చేసింది. మృతుని భార్య రమ వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో ఈ మొత్తం జమ అయింది. అందుకు సంబంధించిన పత్రాలను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ కోట అజయ్‌బాబు శనివారం బాధితురాలికి అందజేశారు.



మృతుని భార్యకు బీమా పత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సస్పెన్షన్ ఎత్తివేయాలని వినతి

వీరఘట్టం: తమపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని, ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేయాలని ఎంఈఓ పర్రి కృష్ణమూర్తి, రేగులపాడు కేజీబీవీ ఎస్.ఓ రోహిణి కోరారు. ఈ మేరకు వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొద్ది రోజుల కిందట విద్యాశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ రేగులపాడు కేజీబీవీని సందర్శించినప్పుడు చోటు చేసుకున్న పరిణామాలపై తమను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారని, అయితే ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో రేగులపాడు కేజీబీవీ బాలికలు శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అందరూ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారని ఎమ్మెల్యేకు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో తాము ఎంతో కృషి చేశామన్నారు. ఈ ఫలితాలను చూసి తమ సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసేలా చొరవ చూపాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే కళావతి సానుకూలంగా స్పందించారు. సమస్యను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకువెళతానని వారికి హామీ ఇచ్చారు.